క్లుప్తంగా

కనీస పింఛన్ రూ.9వేలు చేయాలి

నెల్లిమర్ల: రిటైర్డు కార్మికులకు అందించే పింఛన్ మొత్తాన్ని కనీసం రూ.9వేలకు పెంచాలని ఈపీఎస్ పింఛనుదారుల సంఘం నాయకులు కిల్లంపల్లి రామారావు, మొయిద పాపారావు మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈపీఎస్ పింఛన్ మొత్తాన్ని రూ.9 వేలకు పెంచాలని దేశ వ్యాప్తంగా ఆందోళనలు చేస్తుంటే సుప్రీంకోర్టు మార్గ దర్శకాల పేరిట ఈపీఎస్ సంస్థ ఉద్యోగులను, కార్మికులను గందరగోళానికి గురిచేయడం సరికాదన్నారు. పెరుగుతున్న ధరలను దృష్టిలో పెట్టుకుని, ఇప్పటికైనా పింఛన్ మొత్తాన్ని పెంచాలన్నారు.

దంత వైద్య శిబిరానికి స్పందన


దంత రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధి జరజాపుపేటలో మంగళవారం నిర్వహించిన ఉచిత దంత వైద్య శిబిరానికి స్థానికుల నుంచి మంచి స్పందన లభించింది. వైస్‌చైర్మన్ సముద్రపు రామారావు, స్థానిక కౌన్సిలర్ల సహకారంతో నిర్వహించిన శిబిరంలో 75 మందికి ఆపిల్ డెంటల్ ఆస్పత్రి వైద్యులు కళ్యాణ్ చక్రవర్తి, జగన్ చికిత్స అందించారు. అవసరమైన రోగులకు ఉచితంగా మందులు అందజేశారు. వైద్య సేవలు అందించిన వైద్యులకు ఘనంగా సత్కరించారు.

ఏపీజీఈఏ సమావేశం రేపు

నెల్లిమర్ల: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం(ఏపీజీఈఏ) విజయనగరం జిల్లా 5వ కౌన్సిల్ సమావేశం మార్చి 2వ తేదీన జరగనుందని జయప్రదం చేయాలని ఆ సంఘం మండల శాఖ ప్రతినిధులు పిలుపునిచ్చారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద సమావేశానికి సంబంధించిన కరపత్రాలను మంగళవారం ఆవిష్కరించారు. విజయనగరంలోని ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్ సమీపంలోనున్న కృషి భవన్లో నిర్వహించే సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కెఆర్.సూర్యనారాయణ పాల్గొంటారని తెలిపారు. ఉద్యోగుల సమస్యలపై సమావేశంలో చర్చిస్తారని పేర్కొన్నారు. సంఘ ప్రతినిధులు భానోజీరావు, సర్వేశ్వర రావు, రవికుమార్, సురేష్, శంకర్రావు, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాలనలోనే టైలర్ల సంక్షేమం


పూసపాటిరేగలో టైలర్లు దినోత్సవం జరుపుకుంటున్న టైలర్లు

పూసపాటిరేగ: ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పాలనలోనే టైలర్ల సంక్షేమం బాగుందని ఆ సంఘం అధ్యక్షుడు లెంక సురేష్ అన్నారు. స్థానిక రాజా వీధిలో ప్రపంచ టైలర్ల దినోత్సం లో భాగంగా మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టైలర్లకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సాయం చేయడం అభినందనీయమన్నారు. సమావేశంలో టైలర్ల సంఘం నాయకులు కానూరి సన్యాసిరావు, రాంబాబుతో పాటు పలువురు టైలర్లు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు


ఆక్రమణలు తొలగిస్తున్న జేసీబీ

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సతివాడ నుంచి ఒమ్మి గ్రామానికి వెళ్లే రహదారిలో జేసీబీల సహకారంతో మంగళవారం పలు ఆక్రమణలను తొలగించారు. రహదారి ఆక్రమణలకు గురికావడంతో నిత్యం ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. సమస్యను గుర్తించిన సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు సలహా మండలి సభ్యుడు అంబళ్ల శ్రీరాములనాయుడు జేసీబీలను పెట్టించి పలు చోట్ల ఆక్రమణలను తొలగించారు. ఆక్రమణల తొలగింపుతో ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు.


మొయిదలో వైద్య శిబిరం


మొయిదలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని మొయిద విజయరామపురం గ్రామంలో ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స వరాహ వెంకట సూర్యనారాయణ రాజు(సురేష్ బాబు) సహకారంతో తగరపువలస అనిల్ నీరుకొండ ఆస్పత్రి ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం జరిగింది. శిబిరంలో గ్రామానికి చెందిన 180 మందికి చికిత్సలు నిర్వహించారు. 32 మందికి వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నట్లు గుర్తించారు. కార్యక్రమంలో డాక్టర్ పృథ్వీ, సర్పంచ్ అట్టాడ కృష్ణ, యడ్ల కృష్ణ, లక్ష్మణరావు, శ్రీను, వెంకట్రావు పాల్గొన్నారు.

ముంచుకొస్తున్న ముగింపు గడువు

- డిమాండ్ రూ.51.61 కోట్లు
- వసూలు రూ. 38.95 కోట్లు
- ఆస్తి, ఖాళీ స్థలాల పన్నుల ముందంజ
- నీటి పన్నుల వసూళ్లలో కానరాని ప్రగతి
- పన్నుల వసూళ్లకు సచివాలయ వారీగా ప్రత్యేక బృందాల నియామకం


నగరంలోని గృహ సముదాయాలు

విజయనగరం:

స్థానిక సంస్థలకు పన్నుల రూపంలో వచ్చే ఆదాయం ఎంతో కీలకం. నగర అభివృద్ధికి ఈ నిధులు సమకూర్చుకోవటం అవసరం. ప్రతి ఏడాది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ రూపాల్లో నిధులు మంజూరు చేస్తున్నా.. స్థానికంగా ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుని ఖజానాను నింపుకోవటం కీలకమనే చెప్పాలి. ఆలా ఆదాయాన్ని సమకూర్చుకున్నపుడే అభివృద్ధి సాధ్యమని అధికారులు పేర్కొంటున్నారు. గత కొన్నేళ్లుగా విజయనగరం కార్పొరేషన్‌కు పన్నుల రూపంలో రావాల్సిన ఆదాయం బకాయిల రూపంలో పేరుకుపోగా.... 2023 – 24 ఆర్థిక సంవత్సరంలో పన్నుల వసూళ్లపై యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది.

డిమాండ్ రూ.51.61 కోట్లు.. వసూలు రూ. 38.95 కోట్లు

కార్పొరేషన్ హోదా దక్కించుకున్న విజయనగరంలో వివిధ పన్నుల రూపంలో ఆదాయం అధికారిక లెక్కల ప్రకారం రూ.51.61 కోట్లుగా ఉంది. ఇప్పటి వరకు రూ.38.95 కోట్లు వసూలు కాగా... ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా మరో రూ.12.65 కోట్లు వసూలు కావాల్సి ఉంది. రావాల్సిన బకాయిల్లో అధిక శాతం మొండి బకాయిలు కావటం గమనార్హం. ఏళ్ల తరబడి సకాలంలో పన్నులు చెల్లించని వారే బకాయిల జాబితాల్లో ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో మొండి బకాయిదారులపై ప్రత్యేక దృష్టి సారించినట్లు అధికారులు పేర్కొంటున్నారు. అవసరమైతే వారిపై మున్సిపల్ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకోనున్నట్లు వెల్లడిస్తున్నారు. వాస్తవానికి ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి అన్ని రకాల పన్నుల రూపంలో రావాల్సి ఆదాయంలో ఆస్తి, ఖాళీ స్థలాల నుంచి ఆశించిన స్థాయిలో పన్నులు వసూలు జరుగుతుండగా.. నీటి పన్నుల వసూళ్ల తక్కువగా ఉన్నట్లు అధికారిక లెక్కలు వెల్లడిస్తున్నాయి. 3 లక్షలకు పైగా ఉన్న నగర జనాభాకు రోజు విడిచి రోజు నీటిని సరఫరా చేసేందుకు విజయనగరం కార్పొరేషన్ ప్రతి ఏడాది రూ.కోట్లలో ఖర్చు చేస్తున్నా పన్నులు చెల్లించేందుకు ప్రజలు అనాసక్తి కనబరచటం గమనార్హం.

మెరుగైన పన్నుల వసూళ్లు

గడిచిన ఆర్థిక సంవత్సరంతో పోల్చుకుంటే ఈ ఏడాది పన్నుల వసూళ్ల మెరుగుపడ్డాయనే చెప్పాలి. ప్రధానంగా ఆస్తి పన్నుతో పాటు నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న ఖాళీ స్థలాల ద్వారా పన్ను రూపంలో ఆదాయం ఖజానాలో జమవుతోంది. ఈ ప్రక్రియలో కార్పొరేషన్ యంత్రాంగం, సచివాలయ సిబ్బంది సఫలీకృతమవుతున్నారు. కొందరు మొండి బకాయిదారులు మినహా అధిక శాతం ప్రజలు పన్నుల వసూళ్లకు ముందుకు వస్తున్నారు. ఇదిలా ఉండగా మొండి బకాయిదారుల నుంచి పన్నుల వసూళ్లు చేసేందుకు సచివాలయాల వారీగా ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. వారు మూకుమ్మడిగా వెళ్లి పన్నులు చెల్లించాలని ఒత్తిడి తీసుకువచ్చే దిశగా కృషి చేస్తున్నారు.

చర్యలకు వెనుకాడం..



నగర అభివృద్ధిలో పన్నుల ఆదాయం కీలకం. ప్రజలు సహకరించి సకాలంలో పన్నులు చెల్లించటం ద్వారా మౌలిక సదుపాయాల కల్పనతో పాటు అభివృద్ధికి ఆస్కారం ఉంటుంది. ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా 100 శాతం పన్నులు వసూలు చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నాం. ఈ మేరకు రెవెన్యూ విభాగంతో పాటు సచివాలయ సిబ్బందికి ప్రత్యేక ఆదేశాలు జారీ చేశాం. పన్నులు చెల్లించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు వెనుకాడం.

– ఆర్.శ్రీరాములనాయుడు, కమిషనర్, విజయనగరం కార్పొరేషన్

పన్ను రకం	అసెస్‌మెంట్‌లు	డిమాండ్	వసూలైన మొత్తం
ఆస్తి పన్ను	65143	రూ.43.49కోట్లు	రూ.24.90 కోట్లు
నీటి పన్ను	25000	రూ.5 కోట్లు	రూ.1.30 కోట్లు
ఖాళీస్థలాల పన్ను	2236	రూ. 3.12 కోట్లు	రూ. 2.75 కోట్లు
మొత్తం	92,379	రూ.51.61 కోట్లు	రూ.38.95 కోట్లు

ప్రజాహిత కార్యక్రమాలు స్ఫూర్తిదాయకం


డిప్యూటీ మేయర్‌ను ఉచితరీతిన సత్కరిస్తున్న సమాఖ్య ప్రతినిధులు

- డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి

విజయనగరం టౌన్: బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య ఆధ్వర్యంలో చేస్తున్న ప్రజాహిత కార్యక్రమాలు ఎందరికో స్ఫూర్తిదాయకమని నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి పేర్కొన్నారు. బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య ఆధ్వర్యంలో గాయత్రీ భవనంలో సమాఖ్య కోశాధికారి దివంగత ఎం.ఆర్.ఎల్ కుమార్ జ్ఞాపకార్థం మంగళవారం ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్యశిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ముందుగా కుమార్ చిత్రపటానికి పూలమాలలేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సమాజ సేవలో బ్రాహ్మణ సమాఖ్య ప్రతినిధులు ముందుకు రావడం ఎంతైనా అభినందనీయమన్నారు. నిరుపేద బ్రాహ్మణులకు అండగా ఉంటూ, కార్పొరేషన్ ద్వారా వారికి చేయూతనివ్వడం హర్షనీయమన్నారు. డాక్టర్ డివి.శ్రీకాంత్ నేత్రత్వంలో 15 మందితో కూడిన వైద్య బృందం రోగులకు అవసరమైన పరీక్షలు చేసి అవసరమైన వారికి ఆల్ఫా స్కాన్స్ ద్వారా ఉచిత రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్‌ను సమాఖ్య ప్రతినిధులు ఉచితరీతిన సత్కరించారు. కార్యక్రమంలో సమాఖ్య అధ్యక్షుడు భోగరాజు బాబూజీ, ప్రోగ్రాం చైర్మన్ దవళ వెంకటరావు, కార్యదర్శి ఇనుగంటి రమేష్, ఉపాధ్యక్షులు భరద్వాజ చక్రవర్తి , నేమాని రామం, భోగరాజు సూర్యలక్ష్మి, రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుపై విచారణకు డిమాండ్

పూసపాటిరేగ: నడిపల్లిలో దళితులు భూములు అమ్మేస్తున్నారని వచ్చిన ఫిర్యాదుపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ ఇ.బాస్కరరావుకు గ్రామానికి చెందిన పలువురు మంగళవారం వినతిపత్రం అందజేశారు. గ్రామంలో దళితులు భూములను అమ్మేస్తున్నారని వచ్చిన ఫిర్యాదులో వాస్తవం లేదన్నారు. గ్రామంలో అన్యాక్రాంతం అయిన భూములపై విచారణ చేయాలన్నారు. కార్యక్రమంలో గంట్లాన అప్పయ్యమ్మ, పచ్చిపాల సన్యాసి, పచ్చపాల అప్పారావుతో పాటు పలువురు వున్నారు.

వైద్య శిబిరానికి స్పందన

నెల్లిమర్ల రూరల్: మండలంలోని చంద్రంపేట గ్రామంలో ఎన్ఆర్ఐ ఆస్పత్రి సౌజన్యంతో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ప్రముఖ వైద్యులు హాజరై సుమారు 150 మంది రోగులను తనిఖీ చేశారు. గుండె సంబంధిత ఈసీజీలు తీసి పలువురిని ఉచిత శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. అవసరమైన వారికి ఉచితంగా విలువైన మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు కర్రోతు వెంకటరమణ, వాల్లే అప్పలనాయుడు పాల్గొన్నారు.

ఎల్లమాంబ ఆశీస్సులు అందరికీ ఉండాలి

- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం: ఎల్లమాంబ తల్లి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఆకాంక్షించారు. విజయనగరంలోని బాలాజీ జంక్షన్ సమీపంలో కొలువు దీరిన ఎల్లమ్మ తల్లిని మంగళవారం ఆయన దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, నిర్వాహకులు మజ్జి శ్రీనివాసరావుకు సాదర స్వాగతం పలికారు.


ఎల్లమాంబను దర్శించుకుంటున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

ప్రసన్నకుమారి మృతికి నివాళిగా వీణా కచేరి


వీణాకచేరి నిర్వహిస్తున్న భమిడిపాటి కనకదుర్గాప్రసాద్

విజయనగరం టౌన్: ఫ్రెండ్స్ ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్ వార్షికోత్సవాల్లో భాగంగా కొత్తపేటలో ఉన్న ఆర్య సోమయాజుల కాశీపతిరావు స్మారక భవనంలో మంగళవారం నిర్వహించిన వీణ కచేరిని సంగీత కళాశాల ప్రిన్సిపాల్ ఆర్‌వి.ప్రసన్నకుమారికి నివాళులుగా అర్పించి, అంకితమిచ్చారు. విశాఖకు చెందిన డాక్టర్ భమిడిపాటి కనకదుర్గాప్రసాద్ వీణ కచేరీ నిర్వహించారు. సహకార వీణను భమిడిపాటి వీణ ధారి, మృదంగంపై మహదాసు ఏడుకొండలు, విశాఖకు చెందిన అయ్యల సోమయాజుల సీతారామ్ కౌండిన్య ఘటంపై సహకరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ధవళ సర్వేశ్వరరావు, కార్యదర్శి డాక్టర్ మండపాక రవి, దేవరాజు గోపాలకృష్ణ, టి.మహేశ్వరరావు, కృష్ణమోహన్, సుబ్బారావు, శివ రామశర్మ, సంగీతాభిమానులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఆర్‌డీఓ

విజయనగరం రూరల్: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో నియోజకవర్గంలోని పలు పోలింగ్ కేంద్రాలను ఆర్‌డీఓ సూర్యకళ మంగళవారం పరిశీలించారు. నియోజకవర్గ కేంద్రం విజయనగరం కార్పొరేషన్ పరిధిలో 116 నుంచి 131 వరకు ఉన్న కంటోన్మెంట్ పాఠశాల, ఎంఆర్ ప్రభుత్వ సంస్కృత పాఠశాల, కస్పా ఉన్నత పాఠశాల, ఎంఆర్ అటానమస్ కళాశాల పోలింగ్ కేంద్రాలను పరిశీలించి సౌకర్యాలపై ఆరా తీశారు. ఎన్నికల అధికారులు, బీఎల్‌ఓలకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ సీహెచ్ బంగార్రాజు, ఎన్నికల డీటీ సంజీవరావు, తదితరులు పాల్గొన్నారు.


పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేస్తున్న ఆర్‌డీఓ సూర్యకళ

ఘనంగా ఎల్లమ్మ జాతర

డెంకాడ: కోర్కెలు తీర్చే కల్పవల్లి పెదతాడివాడ ఎల్లమ్మ జాతర మహోత్సవం ఘనంగా జరిగింది. మంగళవారం ఉదయం నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. పూజారి చిట్టి ఎల్లయ్య గ్రామంలోని ప్రధాన వీధిలో పాలధార తిరిగారు. ఈ సమయంలో భక్తులు పండ్లు, పసుపు, కుంకుమలు విసిరి మొక్కలు తీర్చుకున్నారు. అనంతరం భక్తజనం పూజల మధ్య పూజారి చిట్టి ఎల్లయ్య అగ్ని గుండం తొక్కారు. మండలంలోని పెదతాడివాడ పంచాయతీలోని గ్రామాలతో పాటు పినతాడివాడ, గుణుపూరుపేట, గుణుపూరు, డెంకాడ, వెదుళ్లవలస, గుండాలపేట, రఘుమండ, డి.కొల్లాం, చొల్లంగిపేట, విజయనగరం మండలంలోని నారాయణపురం, జమ్ము,పదాలపేట గ్రామాల నుంచి భక్తులు అమ్మవారి జాతరలో పాల్గొని పూజలు చేశారు.


ఎల్లమ్మతల్లికి భక్తులు పూజలు

అవంతిలో మెగా జాబ్ మేళా

భోగాపురం: మండలంలోని రావాడ కళాశాలలో అవంతి రీసెర్చ్ అండ్ టెక్నాలజీ అకాడమీ ప్రతినిధులు మంగళవారం మెగా జాబ్ మేళా నిర్వహించారు. ఈ జాబ్ మేళాలో 15 బహుళ జాతి కంపెనీలు విద్యార్థులకు ఇంటర్‌వ్యూ నిర్వహించారు. ఇంటర్వ్యూలలో అవంతి ఇంజినీరింగ్, ఫార్మసీ, డిగ్రీ, ఎంబీఏ చివరి సంవత్సరం చదువుతున్న సుమారు వెయ్యి మంది విద్యార్థులు హాజరు కాగా వారిలో 350 మంది విద్యార్థులు క్యాంపస్ ప్లేస్‌మెంట్లకు ఎంపికయ్యారు. జాబ్ మేళాలో ముఖ్యఅతిథిగా అవంతి గ్రూప్ చైర్మన్ మరియు భీమిలి నియోజకవర్గం ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ పి.గోవిందరావు, డైరెక్టర్ రాఘవరావు, వైస్ ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసరావు, హెచ్ఓడీలు, అధ్యాపకులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.


విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న బహుళ జాతి కంపెనీ ప్రతినిధులు

కలుషిత జలాలతో నష్టపోతున్నాం..


కందివలసగెడ్డలో కలుషిత జలాలను పరిశీలిస్తున్న అల్లాడపాలెం గ్రామస్తులు

పూసపాటిరేగ: పరిశ్రమల నుండి విడుదలవుతున్న కలుషిత జలాలతో నాశనం అవుతున్నామని అల్లాడపాలెం గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని కందివలస గెడ్డలో పరిశ్రమలు వదిలిన వ్యర్థ జలాలను మంగళవారం పరిశీలించారు. వ్యర్థ జలాలకు కారణమైన రెడ్డీస్, ఆంధ్రా ఆర్గానిక్స్ యాజమాన్యాలకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ అల్లాడ రమేష్ మాట్లాడుతూ కందివలస గెడ్డలో వ్యర్థ జలాలు వదలడంతో గ్రామంలో భూగర్భజలాలు కలుషితమై తాగునీరుకు ఇబ్బంది పడుతున్నామన్నారు. గెడ్డలో నీరు పశువులు తాగి మృత్యువాత పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

కాలుష్య నియంత్రణ మండలి అధికారులు గెడ్డలో వ్యర్థ జలాలను పరిశీలించి సంబంధిత పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అల్లాడ సత్యవతి, మాజీ సర్పంచ్ లంకలపల్లి శ్రీనివాసరావు, అల్లాడ శ్రీనివాసరావుతో పాటు గ్రామానికి చెందిన పలువురు పాల్గొన్నారు.

విద్యార్థులకు మద్దతుగా 'ధీర'

విజయనగరం ఫూల్‌బాగ్:

ప్రపంచ స్వచ్ఛంద సంస్థల దినోత్సవం సందర్భంగా ధీర ఫౌండేషన్ వారు ఎస్ఎఫ్ఐకు విద్యార్థుల భవిష్యత్ కోసం రూ.లక్ష విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ధీర ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ బొత్స సందీప్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం కూడా నిరుపేద విద్యార్థులకు ఆర్థిక సహాయం అందజేయడం జరుగుతుందన్నారు. నిరుద్యోగులకు వృత్తి విద్య శిక్షణ కేంద్రాల ద్వారా శిక్షణ ఇప్పించి వారిని ఆదుకోవటం జరుగుతుందన్నారు. పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న వారికి కోచింగ్ కేంద్రాల ద్వారా నాణ్యమైన కోచింగ్‌ను కల్పించి వారికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ధీర ఫౌండేషన్ సిబ్బంది రవికిరణ్, ఎస్ఎఫ్ఐ నాయకులు రామ్మోహన్‌రావు, ఎల్‌జె. నాయుడు, సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


ఎస్ఎఫ్ఐ నాయకులకు చెక్కు అందజేస్తున్న బొత్స సందీప్‌బాబు

ఘనంగా సైన్స్ దినోత్సవం

జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పాఠశాలల్లో మంగళవారం విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాజెక్టులతో సరికొత్త ఆలోచనలకు శ్రీకారం చుట్టారు. ప్రాజెక్టులు ఉపాధ్యాయులను, వీక్షకులను ఆలోచింపజేశాయి. ఆయా కార్యక్రమాల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



భోగాపురం: విద్యార్థులు తయారుచేసిన ప్రాజెక్టులతో ఉపాధ్యాయులు


నెల్లిమర్ల రూరల్: బొప్పడాం ఉన్నత పాఠశాలలో సైన్స్ ప్రాజెక్టులను తిలకిస్తున్న ఉపాధ్యాయులు


నెల్లిమర్ల రూరల్: సెంచూరియన్ వర్సిటీలో జాతీయ సైన్స్ దినోత్సవంలో మాట్లాడుతున్న వీసీ ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు


పూసపాటిరేగ: విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టు


విజయనగరం రూరల్: సారిక ప్రాథమికోన్నత పాఠశాలలో వైజ్ఞానిక ప్రదర్శనను ప్రారంభిస్తున్న ఎంపీపీ అప్పలనాయుడు


సత్య డిగ్రీ, పీజీ కళాశాల ఆవరణలో సర్ సివి.రామన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కళాశాల ప్రతినిధులు


డెంకాడ: రఘుమండ ఉన్నత పాఠశాలలో ప్రాజెక్టులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు